క్లుప్తంగా

సీఎం సహాయనిధితో పేదలకు ఊరట



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ఆపదలో ఉన్న రోగులకు సీఎం సహాయనిధి తోడ్పాటుగా నిలుస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 10 మందికి మంజూరైన రూ.7.55 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కేసులకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కీడాకారుడిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎస్‌డీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడని కళాశాల చైర్మన్ కొండారెడ్డి, ప్రిన్సిపాల్ విజయశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్–19 జట్టులో తమ కళాశాల విద్యార్థి మధురమేష్‌రెడ్డి రాణించాడని చెప్పారు. ముక్కమల్ల నవీన్‌కుమార్ గరి, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఉమ్మడి మన సంస్కృతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభ పరీక్షల పోటీలను గత నెల 11న నిర్వహించినట్లు బాలా అకాడమీ పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాధవీలత, రవీంద్రనాథ్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎస్.అఫియా రెండవ ర్యాంకు సాధించగా.. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈనెల 2వ తేదీన బహుమతితో పాటు, ప్రశంసా పత్రం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారని చెప్పారు.

సురక్షతో మెరుగైన వైద్యం



జగనన్న సురక్ష కిట్లను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జగజ్జననీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 630 మందికి వైద్యం అందించామని, వారిలో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్యాధికారి ప్రియభావన తెలిపారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ హుసేన్ సాహెబ్‌కు పింఛన్ అందజేస్తున్న బాషా

గోస్పాడు: మండలంలోని ఎస్.నాగులవరం గ్రామానికి చెందిన షేక్ హుసేన్ సాహెబ్ అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలసుకున్న వలంటీర్ బాషా శనివారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు.

ఇంటర్ విద్యార్థులకు దాతల సహకారం

గోస్పాడు: ఇంటర్ విద్యార్థుల ఫీజు చెల్లించేందుకు దాతలు సహకారం అందించారు. మండలంలోని దీబగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న 11 మంది వాల్మీకి విద్యార్థుల పరీక్షల ఫీజును వాల్మీకి సంఘం ప్రతినిధులు రిటైర్డు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, రిటైర్డు ఈఈ శ్రీనివాసులు, సుగుణ్ చెల్లించారు. యుగంధర్‌రెడ్డి 9 మంది విద్యార్థులకు పరీక్షల ఫీజు చెల్లించిన అనంతరం 10 మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తామని చెప్పారు. అలాగే స్థానిక ఏపీజీబీ బ్యాంకు ఉద్యోగి గోవిందరెడ్డి నలుగురు విద్యార్థుల ఫీజులను ప్రిన్సిపాల్ బాలచంద్రుడుకు అందజేశారు. ప్రసాదు కళాశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా అందజేశారు.



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రాజు.. ఒంటివెలగల గ్రామ నివాసి. 'నేను చాలా రోజుల నుంచి హైపో థైరాడిజంతో బాధపడుతున్నా. కొద్ది రోజుల క్రితం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆ సమయంలో వైద్యులు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక వైద్య సేవలు అవసరమని గుర్తించారు. అప్పటికి మందులు అందజేసి పంపిచారు. రెండు రోజుల తరువాత ఆసుపత్రి వారే ఇంటికొచ్చి యాళ్లూరు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు'. ఇలాంటి సేవలను ఇంతకు ముందు చూడలేదు. ప్రభుత్వం ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలను ఇలాంటి శిబిరాల ద్వారా ఆదుకోవడం అభినందనీయమంటున్నాడు.



ఈమె పేరు పుల్లమ్మ, పసురపాడు గ్రామ నివాసి. 'తాను కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా. మంచి వైద్య చేయించుకోలేక అలాగే గడుపుతున్నాను.ఇటీవల గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. కీళ్ల నొప్పులతో బాధ పడుతుందని, మరింత మెరుగైన వైద్యం అవసరమని, మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉందని, ఉత్తమ వైద్యానికి రెఫర్ చేశారు. గ్రామంలో వైద్య శిబిరం ముగిసిన రెండు రోజులకు ప్రభుత్వం పంపిన వాహనంలో యాళ్లూరు ఆసుపత్రికి తీసుకెళ్లి మరిన్ని వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశార'ని సంతోషంగా చెబుతోంది.

రెఫరల్ రోగులను ఆటోల్లో చికిత్స నిమిత్తం తరలిస్తున్న వైద్య సిబ్బంది



ప్రజారోగ్యానికి రక్ష

- జగనన్న సురక్ష వైద్య శిబిరాల ద్వారా పల్లెల్లో ఆరోగ్య పరీక్షలు
- ఉత్తమ వైద్యం కోసం 173 మందిని రెఫర్ చేసిన వైద్యులు
- రోగులను వైద్య కేంద్రాలకు తరలించిన ప్రభుత్వం
- ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వారికి ప్రత్యేక వైద్యం
- 125 మందికి రెఫరల్ వైద్యం పూర్తి



ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

వైద్య విధానంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ పేరుతో పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువ చేసిన్పటికీ.. అందరికీ వైద్యం అందడం లేదని భావించి గ్రామంలో.. 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య వివరాలను సేకరించి, ఒక రోజు నిపుణులైన వైద్యులతో శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు, చికిత్స చేసి మందులు ఉచితంగా అందజేసింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారిని, మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ వైద్యశాలలకు రెఫర్ చేశారు. అక్కడితో ముగించకుండా రెఫరల్ పేషంట్లను ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి మరిన్ని వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సీజనల్ వ్యాధుల కాలంలో ఈ మెడికల్ క్యాంపులను నిర్వహించడం ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగింది. ప్రభుత్వ లక్ష్యంతో ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఊరట లభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని తేలిగ్గా తీసుకుని వైద్యం చేయించుకోవడంలో ఒకింత నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి కొందరు వ్యాధి ఏమిటో తెలుసుకోకుండా ఎక్కడ పడితే అక్కడ మందులు తెచ్చుకొని వేసుకుని వ్యాధి ముదిరే వరకు ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ చివరి వారంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యులతో ప్రత్యేక వైద్యం అందించాలని సంకల్పించింది. సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వాధ్యులను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటి సర్వే బాధితులను గుర్తించారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు..

ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టి ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్య సమస్యలను గుర్తించారు. సర్వే పూర్తయిన తరువాత వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, గళ్ల పరీక్షలను ఇంటి వద్దనే చేసి వివరాలు నమోదు చేసి టోకెన్ ఇచ్చారు. ఆ తరువాత గ్రామంలోనే.. నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాధి నివారణ చేయడంతో జబ్బులను గుర్తించి మందులు అందజేశారు.

రెఫరల్ చేసిన వారికి ప్రత్యేక వైద్యం..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా మండలంలోని పది హెల్త్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య సేవలు అందించారు. శిబిరాల్లో 4,744 మందికి వైద్య పరీక్షలు చేసి 173 మందిని మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. వీటితో పాటు 2,768 మందికి వ్యాధి నిర్ధారణ కోసం ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. అయితే రెఫర్ చేసిన వారికి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా రెఫరల్ రోగులను స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఖర్చులతో ప్రత్యేక వైద్య చికిత్సల కోసం వాహనాలు ఏర్పాటు చేసి నంద్యాల, యాళ్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించింది. రెఫరల్ చేసిన 173 మందిలో ఇప్పటికే 125 మందికి మెరుగైన వైద్యం కూడా పూర్తి చేసినట్లు సంబంధిత వైద్యులు పేర్కొన్నారు. కంటి వెలుగు కింద రెఫరల్ చేసిన వారికి ఈనెల 14వ తేదీన నంద్యాలలోని స్వామి నేత్రాలయం ఆసుపత్రిలో చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు.

ప్రజారోగ్యం కోసమే..



గత నెలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా గుర్తించిన రెఫరల్ రోగులకు ప్రత్యేక వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వమే గ్రామాల్లో ఆటోలు ఏర్పాటు చేసి రవాణా చార్జీలు భరించి సంబంధిత ఆసుపత్రులకు వారిని తరలించి మెరుగైన వైద్యం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడం కోసమే ప్రభుత్వం ఖర్చు వెనకాడకుండా వైద్య సేవలందిస్తుంది.

– గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

రుద్రవరం: వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు.అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మ వార్లకు నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తాదులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దొర్నిపాడు: చాకరాజువేముల, డబ్ల్యూ.కొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జయప్రసాద్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది, వసతులు ఎలా ఉన్నాయి, విద్యుత్ సౌకర్యం, గోడలు, మెత్తు, ఫ్లోరింగ్ వంటి వాటిని పరిశీలించారు. బుర్రారెడ్డిపల్లె వినహా అన్నికేంద్రాల్లో వసతులు ఉన్నాయని తెలిపారు. బుర్రారెడ్డిపల్లె పీఎస్‌ను అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చే అవకాశం ఉందన్నారు.

6లోగా ఆక్రమణలు తొలగించాలి

నంద్యాల(అర్బన్): గ్రామ పంచాయతీకి సంబంధించి రహదారులు, మురుగు కాల్వలపై అక్రమంగా నిర్మించిన వాటిని ఈనెల 6వ తేదీలోగా తొలగించాలని కానాల మేజర్ గ్రామ పంచాయతీ కార్య నిర్వహణ అధికారి నరేంద్ర తెలిపారు. ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన పోస్టర్‌ను ప్రధాన రహదారిలో శనివారం గ్రామస్తులతో కలిసి ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కరిగిన మేఘం..



దొర్నిపాడులో కురుస్తున్న వర్షం

దొర్నిపాడు: కొన్ని రోజులుగావర్షం కురవాలని గ్రామ దేవతలు, వివిధ దేవుళ్లకు ఆలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు చేశారు. అయినా చినుకు జాడ లేకపోయింది. ఈ ఏడాది ఇంతేనేమో అనుకుంటున్న సమయంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావృతమై చిన్నపాటి వర్షం కురిసింది. ప్రస్తుతం వర్షం కురిస్తే మినుము, శనగ పంటలు ఆశించిన మేరకు ఎకరాకు 8 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే మిరప, పత్తి పంటలకు ఊపిరి లూదినట్లవుతుంది. ఇక రబీ శనగ సాగు జోరందుకుంటుంది.

చికిత్స తర్వాత బాబు జైలుకు వెళ్లాల్సిందే

నంద్యాల: స్కిల్ స్కాం కేసులో జైలుకెళ్లిన చంద్రబాబు కంటి ఆపరేషన్‌ను సాకుగా చూపి బెయిల్‌పై బయటికి వచ్చాడని, చికిత్స తరువాత జైలుకెళ్లాల్సిందేనని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పద్మావతి నగర్‌లోనున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ స్కామ్ కేసులో డబ్బులు షెల్ కంపెనీలకు దారి మళ్లాయా లేదా అనే నిజాన్ని ప్రజలకు చెప్పాల్సిన అవసరం చంద్రబాబుపై ఉందన్నారు. అనారోగ్య కారణాలను సాకుగా చూపి బెయిల్‌పై బయటకు వచ్చి ర్యాలీలు, సమావేశాలు నిర్వ హిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నిర్దోషి అయితే తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన 5మండలాల పరిధిలోని 44 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.39.43 లక్షల విలువైన చెక్కులను శనివారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

అప్రమత్తత అవసరం

నంద్యాల(న్యూటౌన్): ప్రమాదం జరిగిన తర్వాత విచారణ కన్నా, ముందస్తు నివారణ చర్యలు, ఆధునిక సాంకేతికత వినియోగం సాయంతో అప్రమత్తంగా ఉండటం అవసరమని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో లోకల్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్ ఆర్డీఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కర్మాగారాల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, కార్యాచరణపై పలు ఫ్యాక్టరీల ప్రతినిధులతో ముఖాముఖి చర్చించారు. ఫ్యాక్టరీల ప్రతినిధులు మాట్లాడుతూ తమ కర్మాగారాల్లో భద్రతా పరంగా అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ నారాయణరెడ్డి, ఫైర్ అధికారి దేవన్న, సీఐ రవీంద్ర, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎస్ఐ రామాంజనేయులు, మెడికల్ ఆఫీసర్ సిసీలియా, ఎస్పీవై ఆగ్రో డైరెక్టర్ చాంద్‌బాషా, విజయ డైరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని తిప్పారెడ్డిపల్లెకు చెందిన శివకుమార్(42) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు కారణంగా గత నెల 27న గడ్డి మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు మృతుడి భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వృద్ధుడు మృతి

ఆళ్లగడ్డ: చింతకొమ్ముదిన్నె గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడు మృతి చెందగా కారులో ఉన్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి మండలం తిప్పనపల్లె గ్రామానికి చెందిన నాగన్న (65) చింతకొమ్ముదిన్నె గ్రామంలో బేల్దారు పనిచేసేందుకు బైక్‌పై బయలుదేరాడు. చింతకొమ్ముదిన్నె గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై నుంచి గ్రామంలోకి దిగుతుండగా కడప నుంచి అహోబిలం వెళ్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తాపడటంతో అందులో ఉన్న కుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడగా స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

చెరువు అలుగుకు గండి

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె చెరువు అలుగుకు శనివారం తెల్లవారు జామున కొందరు రైతులు గండి కొట్టారు. ఆ గండి నుంచి నీరు దిగువకు పారడంపై వివాదం నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు చెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాలను బీళ్లుగా వదిలేశారు.అయితే ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా వారాబంధీ పద్ధతిలో నీరు విడుదల చేయడంతో ఆ నీరు బి.నాగిరెడ్డిపల్లె చెరువుకు చేరింది. దీంతో రైతులు ఆయకట్టు పొలాల్లో వరి పంట సాగు చేశారు. అయితే చెరువుకు దిగువ భాగంలోని పేరూరు పొలిమేరలో చిన్న చెరువు ఉంది.బి.నాగిరెడ్డిపల్లె చెరువు పూర్తిగా నిండిన తరువాత అలుగు నుంచి వచ్చే నీటితోనే ఆ చెరువు నిండుతుంది. ఏటా ఇబ్బందిలేకపయినా, ఈ ఏడాది వర్షాభావంగా కారణంగా చిన్న చెరువు కింద సాగు చేసిన పంటలకు నీరందించాలని కొందరు నాగిరెడ్డి పల్లె చెరువు గండికొట్టారు. విషయం తెలుసుకున్న బి.నాగిరెడ్డిపల్లె చెరువు ఆయకట్టు రైతులు గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయంపై ఎంఐ ఏఈ మునాఫ్‌ను ప్రశ్నించగా.. అలుగుకు గండి కొట్టడం తప్పన్నారు.



చెరువు అలుగుకు గండి కొట్టిన దృశ్యం

కేంద్రంపై పోరాటానికి సిద్ధమవ్వాలి

నంద్యాల(సెంట్రల్): తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను తాకట్టు పెట్టిందని, అన్యాయంపై పోరాడేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్రం చీకటి చట్టం– ఆంధ్రప్రదేశ్ భవిష్యత్, కరవు పరిస్థితులపై శనివారం పట్టణంలోని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సీమ సాగునీటి ప్రాజెక్టుల నీటి కేటాయింపుల్లో కోత విధించి తెలంగాణకు లబ్ధి చేకూర్చేలా ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో చీకటి ఆదేశమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అభివర్ణించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు , సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రా రెడ్డి, మహేశ్వరరెడి పాల్గొన్నారు.

తోటల సాగుకు ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : పండ్ల తోటల సాగుకు ఉపాధి హామి పథకం కింద ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు కల్పిస్తోందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్బీకేలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో కొబ్బరి, నిమ్మ సాగు చేసిన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి , ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన బాదుల్లాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ శనివారం తెలిపారు.

సాధికారక యాత్రను విజయవంతం చేద్దాం



ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఉయ్యాలవాడ : నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ పట్టణంలో ప్రారంభమవుతున్న సామాజిక సాధికారక బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్వగృహంలో నవంబర్ 7న నిర్వహించే బస్సు యాత్రపై పార్టీ మండల కార్యకర్తల విస్తృత సమావేశం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో కలిసి నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కులమతాలకతీతంగా రాజ్యాంగ పదువులు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రానికి జగనన్న సీఎంగా మరో సారి ఎందుకు కావాలో ప్రతి ఒక్కరికీ వివరించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బస్సు యాత్రలకు రాష్ట్ర వ్యాప్తంగా లభిస్తున్న విశేష స్పందనను చూస్తుంటే వైనాట్ 175 సీట్లపై ప్రతి ఒక్కరిలో నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, దేశం సుధాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

బాల్యవివాహాల నివారణకు చర్యలు తీసుకోండి

- ఇంటర్, పదో తరగతి విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: బాల్య వివాహాలను నివారించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్, బాల్య వివాహాల నివారణ, నాడు–నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై వివిధ కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాల నియంత్రణకు ఏర్పాటు చేసిన కమిటీలను పటిష్ఠం చేయాలన్నారు. ఇంటర్మీడియెట్, పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను మళ్లీ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్‌లో 2వేల మంది, టెన్త్ క్లాస్‌లో 400 మంది విద్యార్థులను విద్యాసంస్థల్లో ఎన్‌రోల్ చేయాలని చెప్పారు. నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాలల నిర్మాణ పనులు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్పందన ద్వారా స్వీకరించిన సమస్యలు మళ్లీ మళ్లీ రీఓపెన్ కాకుండా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతానికి ప్రణాళికలు రూపొందించండి

జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో రీ సర్వే, ఆర్‌ఓఆర్ కేసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ –పరాయికరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూములు, తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు కచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఏమేర రీ సర్వే పనులు పూర్తయ్యాయో నివేదికలు ఇవ్వాలని ఆర్డీవోలను ఆదేశించారు. బనగానపల్లె, అవుకు మండలాల్లో రీ సర్వే ఎందుకు జరగడం లేదని ఆర్డీఓ శ్రీనివాసులును ప్రశ్నించారు. మ్యుటేషన్ కచ్చితంగా అప్‌లోడ్ చేయాలన్నారు. భూ వివాదాల డిస్ప్యూట్స్‌కు సంబంధించి స్పందన కార్యక్రమంలో అనేక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత తహసీల్దారులు, వీఆర్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని చెప్పారు. ఆర్‌ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారంలోపు నివేదిక ఇవ్వాలన్నారు. జేసీ మాట్లాడుతూ మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్తున్నాయని పలుమార్లు సూచించినప్పటికీ తహసీల్దారులు, వీఆర్వోలు అశ్రద్ధ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ఏడీ సర్వే లాండ్స్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం మోపాలి

బొమ్మలసత్రం: జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులకు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మద్యం దుకాణాలు, బార్లకు మద్యం సరఫరాపై నిఘా ఉంచాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మార్పీ ధరలకే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలు సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మద్యం దుకాణంలో డిజిటల్ పేమెంట్లు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ, సీఐలు కృష్ణకుమార్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.